

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

26 జనవరి 2026 పేజీలు : 08


జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండేలా..

# ఆత్మకూరు క్రీడా వికాస కేంద్రం

- విస్తీర్ణం 20 ఎకరాలకు పెంపు
- రూ.1.8కోట్ల నిధులు మంజూరు
- మరిన్ని నిధులకు ప్రతిపాదనలు
- 14.లక్షలతో నగరవనం ఏర్పాటు : మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరులో క్రీడా వికాస కేంద్రం (స్టేడియం)ను జిల్లాలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కృషిచేస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. 1.8 కోట్ల రూపాయలతో స్టేడియం నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారం భించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రిగా ఆత్మకూరుకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆనం రామనారాయణ రెడ్డి ఈ స్టేడియం నిర్మాణానికి 2 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించగా 50 లక్షల రూపాయలతో పనులు జరిగి నిలిచిపోయాయి. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. మళ్ళీ ఆత్మకూరు ఎమ్మెల్యేగా వచ్చి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా కొనసాగుతున్న ఆనం రామనారాయణరెడ్డి గమనించి, 18 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి ఆదివారం పనులను ప్రాంభించేలా భూమిపూజ చేశారు. గతంలో అప్పటి పరిస్థితిని బట్టి ఈ స్టేడియంకు 10 ఎకరాల స్థలం కేటాయించ గా పెరుగుతున్న పట్టణ పరిస్థితిని బట్టి విస్తీర్ణం మరో 10 ఎకరాలు కేటాయించేలా మంత్రి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో పనులు జరుగు తాయని, 20 ఎకరాల్లో స్టేడియంను మరింతగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి, క్రీడా మంత్రి, జాతీయ, రాష్ట్ర స్పోర్ట్స్ కౌన్సిల్‌ల దృష్టికి తీసుకెళ్ళి మరింతగా నిధులు సాధించి జిల్లాలోనే నెంబర్‌వన్ స్టేడియంగా తీర్చిదిద్దుతామని రామనారాయణరెడ్డి ప్రకటించారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు -మిగతా 2లో

ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యంగా

# భద్రతా చర్యలు

జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

రానున్న గణతంత్ర దినోత్సవం, రథసప్తమి పర్వదినం సందర్భంగా జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు, ఏఎస్పీ సూచనలతో జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రముఖ దేవాలయాలు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల -మిగతా 2లో

మాది మాటల ప్రభుత్వం కాదు..

# చేతల ప్రభుత్వం

- పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట
- నెల్లూరులో రూ.30 లక్షలతో హోమియోపతి కేంద్రం
- ఆయుష్ హోమియోపతి డిస్పెన్సరీకి మంత్రి నారాయణ శంకుస్థాపన
- మూడు నెలల్లోనే ఆసుపత్రి నిర్మాణం పూర్తి.. పేదలకు నాణ్యమైన వైద్యం అందడమే లక్ష్యం
- హామీ ఇవ్వని పనులను కూడా నెరవేరుస్తున్నాం
- మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

నగర అభివృద్ధి, పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరం 47వ డివిజన్‌లో సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఆయుష్ హోమియోపతి డిస్పెన్సరీ భవనానికి ఆయన ఆదివారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న స్వర్ణకారులు, నిరుపేదల చిరకాల వాంఛను నెరవేరుస్తూ.. శిథిలావస్థకు చేరిన పాత కేంద్రాన్ని పునర్నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ఈ భవన నిర్మాణాన్ని కేవలం 3 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 30 ఏళ్ల క్రితమే ఆసుపత్రి కోసం స్థలాన్ని దానం చేసిన గూడూరు మునిస్వామి నాయుడు సేవా దృక్పథానికి ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని, ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి 'ప్రజా దర్బార్'ల ద్వారా అగ్రతాంబూలం ఇస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా నెల్లూరు నగరాన్ని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, కాలువల -మిగతా 2లో



శ్రీవారి రథ సప్తమి వేడుకల్లో..

# ప్రశాంతిరెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన వాహన సేవలు.. భక్తులను తరింపజేస్తున్నాయి. రథసప్తమి వేడుకల సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి.. తిరుమల శ్రీవారి వాహన సేవలో పాల్గొన్నారు. తెల్లవారు జామున నిర్వహించిన సూర్యప్రభ వాహన సేవలో టిటిడి ఈవో, చైర్మన్, బోర్డు సభ్యులతో కలిసి ఆమె వాహన సేవలో పాల్గొని శ్రీవారి ఆశీసులు అందుకున్నారు. రథసప్తమి ఏర్పాట్లపై ఆయా అధికారులతో ప్రశాంతి రెడ్డి మాట్లాడారు.

# నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

- ప్రతీ ఇంటికీ కుళాయి.. నగరం నిండా నిఘా నేత్రాలు
- అంతర్జాతీయ స్థాయిలో మున్సిపల్ పాఠశాలలు
- దుష్ప్రచారాన్ని నమ్మలేదు.. మెజారిటీతో బుద్ధి చెప్పారు
- ప్రజల రుణం తీర్చుకుంటా.. అభివృద్ధిని అడ్డుకుంటే వదిలేది లేదు
- అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్లను భాగస్వాములను చేస్తాం
- మంత్రి నారాయణ వెల్లడి




**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర అభివృద్ధిలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు వెల్ఫేర్ ఫెడరేషన్ 9వ వార్షికోత్సవ వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి నారాయణకు ఫెడరేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం ప్రారంభంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'నెల్లూరు మేరీ జాన్' అనే ప్రత్యేక మేగజైన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ.. మంత్రి నారాయణ నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఉండటం తమ అదృష్టమని, నగర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిలో తామంతా సైనికుల్లా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సభను ఉద్దేశించి మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా నేను అనేక దేశాలు తిరిగానని అక్కడ వెల్ఫేర్ అసోసియేషన్లు చాలా పటిష్టంగా ఉన్నాయన్నారు. కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన ఈ సంస్కృతిని 9 ఏళ్ల క్రితమే నెల్లూరుకు పరిచయం చేసి, 8 అసోసియేషన్ల నుండి 42 అసోసియేషన్లకు విస్తరించిన చంద్రశేఖర్ రెడ్డి కృషి అభినందనీయమని తెలియజేశారు.వచ్చే జూన్ నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ అందిస్తామని భద్రత కోసం వెయ్యి సిసి కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణకు 7 చోట్ల ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 200 కోట్లతో 15 మున్సిపల్ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని, నాపై గౌరవంతో సిఎస్ఆర్ నిధులు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా 2017లో నగరం ఎదుర్కొన్న వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని కాలువల ఆధునీకరణ చేపడుతుంటే, దానిపై కూడా కొందరు రాజకీయం చేయడం విచారకరమన్నారు. ప్రజల పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి మున్సిపాలిటీల అభివృద్ధికే ఖర్చు చేస్తున్నామని తెలియచేశారు. 2019లో కొందరి దుష్ప్రచారం వల్ల ఓడిపోయినప్పటికీ, వాస్తవాలను గ్రహించిన ప్రజలు 2024లో తనను భారీ మెజారిటీతో గెలిపించారని మంత్రి గుర్తు చేసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రజల రుణం తీర్చుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మురళీకృష్ణ స్వీట్స్ అధినేత గోసు సుబ్బారావు, 42 వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే ప్రథమస్థానంలో ఉండేలా.. ఆత్మకూరు క్రీడా వికాస కేంద్రం





(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేయించామని, రానున్న మూడున్నర ఏళ్ళలో అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని ఆనం పేర్కొన్నారు. ఈ క్రీడా ప్రాంగణం పూర్తయ్యాక ఉపాధ్యాయులు, ప్రధానంగా పీఈటీలు, పీడీలు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని, రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడాకారులను తయారు చేయాలని ఆయన సూచించారు. తాను 1984లో స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్‌గా ఉన్న సమయంలో నెల్లూరులో ఏసి సుబ్బారెడ్డి క్రీడా మైదానం, మెడికల్ కళాశాలల గోడలు నిర్మించామని ఆయన తెలిపారు. తాను విద్యార్థి దశలో క్రీడలపట్ల ఆసక్తి చూపానని, అనంతరం అనేక క్రీడా సంఘాలకు అధ్యక్షుడినయ్యానని, రాష్ట్ర స్పోర్ట్ కౌన్సిల్ చైర్మెన్ అయ్యాయని ఆయన గుర్తు చేసుకున్నారు.

**ఆత్మకూరు మణిహారంగా నగర వనాన్ని అభివృద్ధి చేస్తాం :**

ఆత్మకూరు మణిహారంగా నగర వనాన్ని తీర్చిదిద్దుతామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరుపాళెం సమీపంలో 100 ఎకరాల్లో 1.4 కోట్ల రూపాయలతో నగరవనాన్ని ఏర్పాటు చేయనుండగా.. ఆ ప్రాంతాన్ని అటవీశాఖాధికారులతో కలిసి రామనారాయణరెడ్డి పరిశీలించారు. ప్రతిపాదనలను ఆయన పరిశీలించి అధికారులతో చర్చించారు. ప్రజలు ప్రకృతి ఒడిలో మానసిక అనందం పొందేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో నగరవనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు 1.4 కోట్లు మంజూరు కాగా, ఇప్పటికే 98 లక్షలు విడుదలయ్యాయని ఆయన వెల్లడించారు. 100 ఎకరాల భూముల్లో చదును చేసి వాకింట్‌ట్రాక్, క్రీడా పరికరాల ఏర్పాటు, స్నేక్‌పార్క్, కాఫీపార్క్, సోలార్ లైటింగ్ వ్యవస్థ, విస్తృత ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అందమైన ముఖద్వారం, గేట్లు, క్రీడా సౌకర్యాలు ఏర్పాటు చేసి దశలవారీగా అభివృద్ధి చేస్తామని రామనారాయణరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో విగ్రహ దాత కంచి పరమేశ్వరరెడ్డి, ఆర్డీవో భూమిరెడ్డి పావని, జిల్లా అటవీ అధికారి మహబూబ్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, ఆత్మకూరు పట్టణ, మండల తెలుగుదేశం అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, సోమశిల ప్రాజెక్టు చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, జిల్లా తెలుగుదేశం కోశాధికారి కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ కంచర్ల మాధవి, మున్సిపల్ వైస్ చైర్మెన్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, కొప్పోలు రమాదేవి, పొడమేకల పెంచలయ్య యాదవ్, మొలబంటి రాజశేఖర్, దగ్గుమాటి శివకోటారెడ్డి, షేక్ మహబూబ్ బాషా, షేక్ గౌస్‌బాషా, తహసిల్దారు పి.పద్మజాకుమారి, ఎంపిడివో పి.రఫీఖాన్, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, డిప్యుటి డీఈవో జానకిరామ్, తెలుగుదేశం నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, దావా పెంచలరావు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, పూనుగుంట ధనుంజయ (ఉత్తర కాలువ వైస్ చైర్మెన్), తలచీరు బాబునాయుడు, వై.నాగమోహన్ రెడ్డి, కోనంకి శ్రీనివాసులు నాయుడు, చంద్రా మల్లికార్జున నాయుడు, నాగినేని పెంచలనాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి, షేక్ హుస్సేన్, దోర్నాదుల సురేష్‌బాబు, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, యు.బాలకృష్ణ, కొండ్రెడ్డి రమణారెడ్డి, షేక్ ఖాజావలి, వీరపురెడ్డి సుదర్శన్‌రెడ్డి, షేక్ మస్తాన్‌వలీ, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, తోట సుబ్బారావు, కన్నపురెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, వేళ్ళ సుమతి, రాపూరు జనార్ధన్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయినీలు తదితరులు పాల్గొన్నారు.

## మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం



(మొదటి పేజీ తరువాయి)

ఆధునీకరణ ద్వారా నగరానికి ముంపు ముప్పు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అభివృద్ధిని అడ్డుకునే కుట్రదారుల మాటలను ప్రజలు నమ్మవద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇన్చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని, పదేళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపి తన నిబద్ధతను చాటుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, ప్రెసిడెంట్ చెంగయ్య ఆచారి, డివిజన్ ఇంచార్జ్ గణేష్ కుమార్, ఆయుష్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యంగా భద్రతా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)




పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జాతీయ వేడుకలు, పర్వదినాల సమయంలో ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా పని చేస్తుందన్నారు. తనిఖీల్లో భాగంగా ప్రయాణికుల గుర్తింపు కార్డులు, ప్రయాణ గమ్యం, ఉద్దే శ్యం, లగేజీలు, బ్యాగులు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ తనిఖీలను ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు బలగాలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌ల సహకారంతో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా కనిపించే బ్యాగులు, ప్యాకెట్లు లేదా పరికరాలను ఎవరూ తాకకుండా, వెంటనే పోలీసులకు లేదా బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను సూచించారు. జిల్లాలోని ముఖ్య ప్రాంతాలలో డ్రోన్స్‌ను వినియోగించి నిఘా ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజల రక్షణకు దృఢమైన ముందస్తు భద్రతా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పోలీసులు – ప్రజలు కలిసి పని చేస్తేనే శాంతియుత జిల్లా సాధ్యం అని, అందరూ సహకరించి పండుగలు, జాతీయ వేడుకలను ప్రశాంతంగా జరుపుకుందామని తెలిపారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు లేదా అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని జిల్లా ప్రజలను కోరారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం నేపథ్యంలో ఆదివారం విజయవాడకు వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. మంత్రి నారా లోకేష్‌తో ఆత్మీయంగా మాట్లాడారు. జిల్లా అభివృద్ధి అంశాలపై లోకేష్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీని నారా లోకేష్ ఆప్యాయంగా పలకరించారు.

– నెల్లూరు, మేజర్‌న్యూస్ :

# జాతీయ ఇన్నోవేటివ్ శిక్షారత్న అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయుడు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ స్థాయిలో ఉత్తమ సేవలను విద్యారంగంలో అందిస్తూ విద్యాబోధన చేస్తూ విద్యార్థుల బంగరు భవిష్యత్తు ధ్యేయంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి నవచారి గతి విద్యా సమూహ భారత్ సంస్థ జాతీయ ఇన్నోవేటివ్ శిక్షారత్న అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డుకు వింజమూరుకు చెందిన ఉపాధ్యాయుడు తాళ్లపాలెం సుబ్రహ్మణ్యం ఎంపిక కావడం గర్వకారణం ఈ సందర్భంగా చిన్న ప్రత్యేక కథనం. సుబ్రహ్మణ్యం పట్టుదలే పెట్టుబడిగా పెట్టారు పేద కుటుంబంలో జన్మించి చదువుల్లో బాగా రాణిస్తూ అన్నింట ప్రథమ స్థానంలో నిలిచారు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సోషయాలజీని చదివారు సామాజిక సమస్యలపై పరిశోధన పత్రాల సమర్పించి ఎన్టీఆర్ ప్రతిభా అవార్డులు సొంతం చేసుకున్నారు ప్రొఫెసర్ ఏఎస్ఎన్ మూర్తి గోల్డ్ మెడలను అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అందుకున్నారు ఎన్నో రంగాలలో ఉద్యోగ అవకాశాలు వచ్చిన తనకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ చూపారు ఆయనే ప్రస్తుతం సంఘం ఉన్నత పాఠశాల ప్లస్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తాళ్లపాలెం సుబ్రహ్మణ్యం. ఈయన వింజమూరు మండలం గుండెమడుగుల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో ఆ పాఠశాలలో జాతీయ ప్రతిభా అన్వేషణ ఉపకార వేతన పరీక్షలకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు జాతీయ ప్రతిభా అన్వేషణ ఉపకార వేతన పరీక్షలలో 2018, 2019 విద్యా సంవత్సరంలో ఆ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషము వీరికి ఒక్కొక్కరికి 48 వేల రూపాయలు స్కాలర్షిప్ వస్తుంది మరో సంవత్సరం ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు డివిజన్లోని ఇతర పాఠశాలలకు మార్గదర్శకంగా నిలిచారు ఇదే వరవడిని సంగం ఉన్నత పాఠశాలలో 2023 24 విద్యా సంవత్సరంలో ఇద్దరూ తర్వాతి సంవత్సరంలో నలుగురు ఎంపికయ్యే విధంగా ఆయన కృషి చేశారు.

**త్రిబుల్ ఐటీ సీట్ల కోసం విద్యార్థులకు ముందస్తు శిక్షణ**

ప్రతిభ కలిగిన విద్యార్థులను ముందుగా గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఎస్ఎస్సి పరీక్షలో ఎక్కువ మార్పులు పొంది ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించేందుకు కృషి చేసేవారు కోవిడ్ 19 లో పదవ



తరగతి పరీక్షలు జరగలేదు ట్రిపుల్ ఐటి ఎంపీక కోసం పరీక్ష పెట్టారు. ఈ పరీక్ష కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఏడుగురు విద్యార్థులు ఎంపిక అయ్యే విధంగా కృషి చేయడం విశేషం తన సొంత నిధులు హెచ్చించి విద్యార్థులకు అవసరమయిన ఉపకరణాలు కొనుగోలు ఫీజులు చెల్లించేవారు.

**వర్చువల్ తరగతుల నిర్వహణ**

గుండే మడగుల ఉన్నత పాఠశాల నందు వర్చు వల్ క్లాసును ఏర్పాటు చేసి విద్యార్థులకు 2018 లోనే డిజిటల్ క్లాస్‌లో నిర్వహించడం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేవారు దీని ద్వారా విద్యార్థులలో ప్రత్యేక ఆసక్తి పెంపొందించడం పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకోవడం జరిగింది.

**మోడల్ జి20 సమ్మిట్ నిర్వహణ**

మోడల్ జి20 సమ్మిట్ 2023 సంఘం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోడీ వివిధ దేశాధ్యక్షుల వేషధారణలో విద్యార్థులకు సమ్మిట్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధికారులు ప్రశంసలు అందించారు ఇన్నోవేషన్ డిజైన్ ఎంప్టీప్రీ న్యూర్ షిప్ బూట్ క్యాంప్ కు ఎంపికై జాతీయ బూట్ క్యాంపులో పాల్గొని విద్యారంగంలో వినూత్న సేవలను గురించి ప్రసంగించిన వ్యక్తి సుబ్రహ్మణ్యం.

**కెరీర్ గైడెన్స్ :** పదవ తరగతి విద్యార్థులు పరీక్షల అనంతరం పాలిటెక్నిక్ లో చేరడం కోసం పోలిసెట్ ఏపీఆర్జేసీ టెస్ట్ శ్రేష్ట లాంటి పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారు ఆ కోర్సులలో చేరేందుకు సహాయం చేసేవారు

**శ్రేష్ట పరీక్షలకు తర్ఫీదు :** కేంద్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులకు సీబీఎస్ఈ పాఠశాలల్లో ఇంటర్ విద్య లో చేరేందుకు శ్రేష్ట పరీక్ష నిర్వహిస్తుంది ఈ పరీక్ష కొరకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి అక్షర విద్యాలయం పాఠశాలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో తమిళనాడు రాష్ట్రంలో ఉచిత ఇంటర్ విద్య సీట్లు సాధించడం విశేషంగా చెప్పవచ్చు

**ప్రధాని ఆహ్వానం అందుకున్న తాళ్లపాలెం**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సెప్టెంబర్ నెలలో కర్నూలుకు వచ్చారు కర్నూలులో జరిగే జీఎస్టీ టు జీరో సభకు వచ్చిన సందర్భంగా తాళ్లపాలెం సుబ్రహ్మణ్యం ఆ సభకు ఆహ్వానించడం ప్రత్యేక ప్రశంసగా మిగిలింది.

**సుబ్రహ్మణ్యం అందుకున్న పురస్కారాలు**

బ్రెడ్ సొసైటీ నుంచి ఎక్సలెన్స్ అవార్డు, సీడ్స్ స్వచ్ఛంద సంస్థ నుంచి ఫ్రంట్ లైన్ వారియర్ పురస్కారం, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు అంతేకాకుండా ఒకే విద్యా సంవత్సరంలో 2025- 26 సంవత్సరంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ జాతీయ ఎన్నో శిక్ష రత్న అవార్డు రావడం విశేషం ఈ అవార్డులో ఉపాధ్యాయ వృత్తి పట్ల మరింత బాధ్యతలను పెంచాలని విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు అలాంటి ఉత్తమ ఉపాధ్యాయులను గౌరవించడం మనల్ని మౌనం గౌరవించుకున్నట్లే అవుతుంది ఇలాంటి ఉపాధ్యాయులను తగిన విధంగా గౌరవించి వారి కృషికి సహకారం అందించినట్లయితే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందుతుందనేది వాస్తవం.

# సూర్యప్రభ వాహనంపై శ్రీ మన్నారాయణుడు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు పట్టణం భక్తిశ్రద్ధలతో పరవశించిపోయింది. రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణం లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో మూడవ రోజైన ఆదివారం స్వామివారు సూర్య ప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు. సూర్య భగవానుడి తేజస్సును ప్రతిబింబించేలా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై ఆసీనులైన శ్రీ మన్నారాయణుడు దర్శనమిచ్చిన క్షణాలు భక్తుల హృదయాలను పరవశింపజేశాయి. వాహన సేవ ఊరేగింపు సందర్భంగా వేద మంత్రోచ్చారణలు, నామస్మరణలతో దేవస్థాన పరిసరాలు ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయాయి. ఉదయం స్వామివారికి సంప్రదాయ బద్ధంగా సుప్రభాత సేవ, మేలు కొలుపు, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం భక్తుల మధ్యగా సూర్యప్రభ వాహన సేవ ఊరేగింపు ఘనంగా సాగింది. స్వామివారి దివ్య దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, 'గోవిందా.. గోవిందా..' నామస్మరణలతో పట్టణాన్ని భక్తిమయంగా మార్చారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం నిత్య హోమం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రథసప్తమి సందర్భంగా నిర్వహించిన ఈ సూర్యప్రభ వాహన సేవ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక శోభను చేకూర్చింది. స్వామివారి కటాక్షంతో భక్తుల



జీవితాల్లో సూర్యుడి వలె వెలుగులు నిండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ఆలయ సేవకులు, ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆనందభరితులయ్యారు.

## యువత సమాజ మార్పు కోసం పోరాడాలి : డివైఎఫ్ఐ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉదయం 6 గంటలకే మొదలై వేల సంఖ్యలో యువత డివైఎఫ్ఐ యువజన సంఘంలో సభ్యులుగా చేరారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఒకరోజు సభ్యత్వం నమోదు కార్యక్రమం నెల్లూరు నగరంలో జరుగుతుందని, డివైఎఫ్ఐ ఆశయాలకు కట్టుబడి వేలాదిగా డివైఎఫ్ఐ లో సభ్యులుగా చేరుతున్నారని, వాళ్ళందరికీ డివైఎఫ్ఐ నగర కమిటీ అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. నగరంలో ఉన్న అన్ని డివిజన్లో డివైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగిందని, అన్ని ప్రాంతాల్లో కూడా యువత స్వచ్ఛందంగా వచ్చి సభ్యులుగా నమోదు చేసుకున్నారని అన్నారు. డివైఎఫ్ఐ అందరికీ విద్య, ఉపాధి కోసం పోరాటం సాగిస్తున్నదని, ఆ పోరాటంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. అదేవిధంగా యువత సమాజంలో మార్పు కోసం పోరాటం చేయాలని కోరారు. గత ప్రభుత్వాలు ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు వాగ్దానాలు ఇస్తున్నారే తప్ప ఏ ఒక్క వాగ్దానం కూడా అమలు చేయడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని అన్నారని కానీ రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. అంతే కాకుండా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని ఆ హామీని కూడా కూటమి ప్రభుత్వం మరచింది అన్నారు. ఇటువంటి తరుణంలో నిరుద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు. నిరుద్యోగ యువత డిగ్రీలు చేతబట్టుకొని ఎలా బతకాలో తెలియక అయోమయంలో మద్యపానం, గంజాయి, డ్రగ్స్ కు అలవాటు పడి తమ జీవితాలు నాశనం చేసుకోవడమే కాక సమాజానికి కూడా నష్టం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సురేంద్ర, రాజేష్, శేఖర్, కృష్ణ బాబులు, మనీ రవి ప్రసాద్, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎంటీఎస్ పరిక్షకు 69మంది విద్యార్థులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి ఎంఎంటిఎస్ఇ పరిక్షను ఎస్ఎస్వి జూనియర్ కాలేజిలో నిర్వహించగా 12 అపుస్మాకు చెందిన పాఠశాలల విద్యార్థులు 69మంది హాజరయ్యారు. నియోజకవర్గ స్తాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 49మంది విద్యార్థులు ఫిబ్రవరి4న జరిగే జిల్లాస్థాయి పరిక్షకు హాజరవుతారన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈపరిక్షలో సంగం వికాస్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు 1, 2, 3, 5, 6, 7, 8, 9 ర్యాంకులను సాధించారని, అనంతరం నాలుగుర్యాంకులను అనంతసాగరం శాంతినికేతన్‌స్కూల్ విద్యార్థులు, 10వర్యాంకును ప్రగతి ఇంగ్లీష్ మీఈడియం స్కూల్ కైవసం చేసుకుంది. ఈవిద్యార్థులకు ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రాములు, స్థానిక సీఐ గంగాధర్‌లచేతులమీదుగా బహుమతీప్రధానం గావించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

## సరస్వతీవిగ్రహం ఆవిష్కరణ : మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఏపి గురుకుల బాలికల పాఠశాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషిచేస్తున్నానని రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో నిత్యాన్న దాత, శ్రీసాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహాన్ని ఆదివారం మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ సరస్వతీ విగ్రహాన్ని పలుసేవా కార్యక్రమాలు చేస్తున్న పరమేశ్వరరెడ్డి ఏర్పాటు చేయడం సంతోషదాయ కమని, పవిత్రమైన రథసప్తమినాడు ప్రారంభించడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈపాఠశాలకు ప్రహరీగోడ కావాలని గతంలో అడిగారని, తాను రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారాలోకేష్‌తో చర్చించానని, ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలో నిధులు మంజూరు కానున్నాయని, వచ్చే విద్యాసంవత్సరం నాటికి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈపాఠశాలకు ప్రహరీగోడ ఆవశ్యకమని, అదీగాక ఈపాఠశాల ముంగిట బైపాస్‌రోడ్డును నాలుగులైన్ల రహదారిగా, సెంట్రల్ లైటింగ్, డివైడర్లతో దాదాపు9కోట్ల రూపాయలు మంజూరుచేయించానని, పనులు జరుగుతున్నాయని, రానున్నకాలంలో ట్రాఫిక్ పెరగనున్నందున ఈస్కూలుకు తప్పకుండా ప్రహరీగోడ అత్యంతావశ్యకమన్నారు. పాఠశాలకు అదనపు వసతులు కల్పించేందుకు కూడా కృషిచేస్తున్నానని మంత్రి వెల్లడించారు. పదేళ్ళక్రితమే ఆత్మకూరు నియోజకవర్గంలో బాలికావిద్యను ప్రోత్సహించేలా ఈగురుకుల పాఠశాలను, అనేక బాలికా విద్యాలయాలను మంజూరుచేయించామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా స్తానిక తెలుగు దేశం నాయకులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మంత్రి ఆనంను శాలువాలు, పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించి ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో విగ్రహదాత కంచి పరమేశ్వరరెడ్డి, ఆర్డీవో భూమిరెడ్డి పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్



చైర్మెన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, ఆత్మకూరు పట్టణ, మండల తెలుగుదేశం అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, సోమశిల ప్రాజెక్టు చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, జిల్లా తెలుగుదేశం కోశాధికారి కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ కంచర్ల మాధవి, మున్సిపల్ వైస్ చైర్మెన్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, కొప్పోలు రమాదేవి, పొద మేకల పెంచలయ్యయాదవ్, మొలబంటి రాజశేఖర్, దగ్గుమాటి శివకోటారెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, షేక్ గౌస్‌బాషా, తహశిల్దారు పి.పద్మజాకుమారి, ఎంపిడివో పి.రఫీఖాన్, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, డిప్యుటి డియివో జానకిరామ్, నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, దావా పెంచలరావు, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, పూనుగుంట ధనుంజయ (ఉత్తరకాలువ వైస్‌చైర్మెన్), తలచీరు బాబునాయుడు, వై.నాగమోహన్‌రెడ్డి, కోనంకి శ్రీనివాసులునాయుడు, చంద్రా మల్లికార్జున నాయుడు, నాగినేని పెంచలనాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి, షేక్ హుస్సేన్, దోర్నాదుల సురేష్ బాబు, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, యు.బాల కృష్ణ, కొండ్రెడ్డి రమణారెడ్డి, షేక్ ఖాజావలి, వీరపురెడ్డి సుదర్శన్‌రెడ్డి, షేక్ మస్తాన్‌వలీ, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, తోట సుబ్బారావు, కన్నపురెడ్డి అమర్ నాధ్‌రెడ్డి, వేళ్ళ సుమతి, రాపూరు జనార్ధన్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.




# శివాజీ ఉత్సవానికి సిద్ధం కండి..

## సింహపురి ప్రజలకు శివాజీ సేన పిలుపు

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గత 6 సంవత్సరాలుగా నెల్లూరులో నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన 2026 పోస్టర్‌ను శివాజీ సేన ఈరోజు విడుదల చేశారు. ఆదివారం నాడు శివాజీ సేన సభ్యులతో నెల్లూరు లోని విజయమహల్ సెంటర్‌లో గల కృష్ణ సాయి కన్వెన్షన్ లో జరిగిన శివాజీ జయంతి ఉత్సవ సన్నాహక సమావేశంలో ఈ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ మేరకు వారు మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 19వ తేదీ సాయంత్రం 4:00 లకు నెల్లూరు విఆర్‌సి గ్రౌండ్ నుండి ప్రారంభమై, గాంధీ బొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్, నర్తకి సెంటర్, కనకమహల్ మీదుగా, కొత్త హాలు, సండే మార్కెట్ మీదుగా, తిరిగి వి ఆర్ సి గ్రౌండ్ వరకు సాగే ఈ కాషాయ ఉత్సవంలో నెల్లూరు ప్రజలు, వేలాదిగా పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శివాజీ సేన అధ్యక్షులు కాకు మురళి రెడ్డి మాట్లాడుతూ.. మన కుటుంబాల్లో, సమాజంలో దేశ భక్తి, ధర్మ నిష్ఠ, పెంపొందాలి అంటే శివాజీ మహారాజ్, శంభాజీ మహారాజ్, రాణా ప్రతాప్, లాంటి మహా వీరులు, దేశ భక్తుల జీవితాలు అధ్యయనం చేయాలని, ఇటువంటి మహనీయుల ఉత్సవల్లో పాల్గొంటే పిల్లలో శౌర్యం, పరాక్రమం పెరుగుతాయాని వారు తెలియజేశారు. ప్రజల ఐకమత్యంతోనే సమాజం లోని విద్రోహ శక్తులను అడ్డుకోగలమని, కులాలు, ప్రాంతాలు, భాషల పేరుతో విడిపోతే సమాజం బలహీన పడుతుందని అయన అన్నారు. శివాజీ మహారాజ్ స్ఫూర్తిని, ప్రజల్లో నింపడానికే గత 6 సంవత్సరాలుగా నెల్లూరు లోని శివాజీ సేన పేరుతో శివాజీ జయంతి ఉత్సవాలు చేస్తున్నామని, కావున ప్రజలందరూ అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా ఈ ఉత్సవంలో పాల్గొనాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన నాయకులు నట్టు సింహాచలం, అశోక్ చౌదరి, పవర్ యూత్ రమేష్, దద్దోలు పవన్ తేజ,బావిశెట్టి వెంకట కిషోర్, పెరుమాళ్, పువ్వాడ పవన్ కుమార్, లెక్కల రాజశేఖర్ రెడ్డి, మహేష్ శర్మ,శ్రీ కుమార్ నాయర్, మోహన్, కొండూరు సుధాకర్, మణికంఠ రాజు, మన్నెం చంద్రశేఖర్, బత్తిన అసంగానంద రెడ్డి, కృష్ణ, అంబటి సురేష్, గుంజి రాజేష్, కుంచెం సింహాద్రి, కేఎస్ హరికృష్ణ, బాలు శర్మ, రాయపు వినోద్, విక్కి, పి.నవీన్, కే.వంశీ, శ్రీనాథ్, గోవింద్, కె.నవీన్, సూర్య, ఎస్‌కే రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని వింజమూరు తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఆర్ఐ పఠాన్ ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపించారు. ముందుగా సచివాలయ సిబ్బంది పాఠశాల విద్యార్థులతో మానవహారంగా ఏర్పాటు చేసి జాతీయ ఓటర్ల దినోత్సవం గురించి తెలియజేస్తూ ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు ఓటును అమ్మడం కొనడం నేరమని ప్రజలంతా చైతన్యవంతులై సేవా తత్పరులైన అభ్యర్థులను ఎన్నుకోవాలని అలాగే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని తదితర అంశాలతో ప్రతిజ్ఞ చేయించారు తదుపరి ఓటర్ల దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లందరూ చైతన్యవంతులై తమ ఓటును స్వచ్ఛందంగా తమకు నచ్చిన విధంగా అభ్యర్థులను ఎంచుకొని ఓటు వేయాలన్నారు మనం వేసే ఓటు మన జీవితాలను మారుస్తుందని తెలిపారు సేవ చేసే అభ్యర్థిని ఎన్నుకున్నట్లయితే మనకు అనేక రకాలైన సేవలు చేయడానికి ముందుంటారని లేనియెడల




తమ స్వార్థం కోసం మనల్ని బలి చేస్తారని తెలిపారు. కావున ఓటు వేసే ముందు ఆలోచించి ఆత్మ పరిశీలన చేసుకుని ఓటు వేయాలన్నారు ఓటు మన హక్కు అని దానిని ఎవరికి బదిలీ చేయడం జరగకూడదని తెలిపారు ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ఓబయ్య వీఆర్వోలు పరిశుద్ధ రావు శిరీష జూనియర్ సహాయకులు మహేష్ కృష్ణాంజలి కంప్యూటర్ ఆపరేటర్లు ఎస్ ప్రసాద్ వరలక్ష్మి సచివాలయ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి : సీపీఎం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గ్రామీణ కార్మికుల పని హక్కు కోసం ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని కోరుతూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారం 6వరోజు మండలంలోని మాదరాజ గూడూరు గ్రామంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధనలు మాట్లాడుతూ.. గ్రామీణ కార్మికుల కొనుగోలు శక్తికి తోడ్పాటునిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజి రాంజీ చట్టాన్ని తేవడం వల్ల వ్యవసాయ కూలీలకు సన్నా చిన్నకారు రైతులకు నష్టం కలిగించడమేనన్నారు. కాబట్టి అందరూ ఐక్యమై ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించేంతవరకు పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ సభ్యులు పాదర్తి మస్తానయ్య, గంప సుధీర్, గుడి రవీంద్ర, మబ్బు పుల్లయ్య, పి.సీనయ్య, మబ్బు ధనుంజయ, ఎస్‌కే నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానంలో ఘనంగా రథసప్తమి వేడుకలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీనివాస నగర్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రాంగణంలో మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో లతో అద్భుతమైన సూర్య భగవాన్ రథం ముగ్గు వేశారు.సూర్య భగవాన్ తన రథంపై అరుణుడితో కలిసి ఏడు అశ్వాలతో ప్రయాణిస్తున్నట్లు ఎంతో కళాత్మకంగా ఈ ముగ్గును రూపకల్పన చేశారు. రంగురంగుల సహజ వర్ణాలతో రూపొం దించిన ఈ రథం ముగ్గు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సూర్యా రాధనకు ప్రతీకగా నిలిచే ఈ కళాఖండం దేవస్థాన వాతావరణాన్ని మరింత ఆధ్యాత్మికంగా మార్చింది. ప్రత్యేకంగా మహిళా భక్తులు సమిష్టిగా శ్రమించి ఈ ముగ్గును రూపొందించడం అందరి ప్రశంసలను అందుకుంది. భక్తి, సంప్రదాయం, కళాత్మకత సమ్మిళితంగా ఈ సూర్య రథం ముగ్గు రథసప్తమి వేడుకలకు మరింత శోభను చేకూర్చింది. ఈ కార్యక్రమాన్ని దర్శించిన భక్తులు మహిళా భక్తుల ప్రతిభను అభినందిస్తూ, ఇలాంటి సంప్రదాయ కళలు తరతరాలకు అందాలని ఆకాంక్షించారు.

# అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా రథసప్తమి వేడుకలు శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి భక్తులు విశేషంగా తరలి వచ్చి సూర్య భగవానుడుని దర్శించుకున్నారు. సూర్య జయంతిగా పిలువబడే ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్య దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి.భక్తులు తెల్లవారుజామునే పవిత్ర స్నానాలు ఆచరించి, జిల్లేడు ఆకులను తలపై పెట్టుకుని స్నానం చేయడం ద్వారా సూర్యుని అనుగ్రహం పొందుతారని నమ్ముతారు. ఇళ్ల ముందు రథం ముగ్గులు వేసి, చిక్కుడు కాయలతో రథం చేసి సూర్యుడికి పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు. ఈ పవిత్రమైన రోజున సూర్య భగవానుడిని ఆరాధించడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం సిద్ధస్తాయని భక్తుల విశ్వాసం. భక్తులకు ఆలయ అధికారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

# 4వ రాష్ట్ర మహా సభను జయప్రదం చెయ్యండి

## నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ అల్లంపాటి పెంచల రెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రెవిన్యూ అసోసియేషన్ భవనంలో ఫిబ్రవరి 5వ తేదిన విజయవాడలో గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగబోయే ఏపీ జేఏసీ అమరావతి 4వ రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి, నెల్లూరు జిల్లా శాఖ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి, నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 5వ తేదీన విజయవాడలో గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగబోయే ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహా సభకు నెల్లూరు జిల్లాలో గల ఉద్యోగులు, ఉపాధ్యాయలు, సచివాలయ ఉద్యోగులు, కార్మికలు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందరు సభకు హాజరయ్యి జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ సభకు తరలి వెళ్ళడానికి నెల్లూరు నుండి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియచేసారు. విజయవాడలో జరగనున్న 4వ రాష్ట్ర మహాసభలో ముఖ్యఅతిధులుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌర సరఫరా శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటున్నారని తెలియజేశారు. నెల్లూరు జిల్లా నుండి సభకు వేలాదిగా తరలి వెళ్లి ఉద్యోగులకు రావల్సిన బకాయిలు, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి తదితర ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారాల కొరకు మన గళం వినిపించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి జనరల్ జనరల్ సెక్రెటరి ఓ.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, మధ్యంతర భృతి, 12వ పిఆర్సి సెటిల్మెంట్స్, డీఏ బకాయిలు, పాత బకాయిలు, చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా మహిళా విభాగం చైర్పర్సన్ వసంత కుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వం పలు దఫాలుగా 6-7 వేల కోట్లు ఇచ్చిందని, మరో 25-30 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కో చైర్మన్ ఈవీఎం శరత్‌బాబు మాట్లాడుతూ.. చనిపోయిన ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు పెండింగ్ ఉండడంతో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ జిల్లా నాయకుడు ఎస్కే జానీ బాషా మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం ఏపీజేసి అమరావతి అని, ఈ సమావేశానికి అత్యధిక సంఖ్యలో ఉద్యోగుల హాజరయ్యేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఏపీజేఏసీ అమరావతి 4వ రాష్ట్ర మహాసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు కాంట్రాక్ట్ ఔటర్సింగ్ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో మహిళా విభాగం జనరల్ సెక్రటరీ చెన్నమ్మ, జనరల్ సెక్రెటరీ ఓవి ప్రసాద్, ట్రెజరర్ బాబురావు, అసిస్టెంట్ సెక్రటరీ ధారా రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్ కృష్ణ శివకుమార్, రాజేష్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కే.డాని యల్ పేపర్‌రావు, సిహెచ్ గోపికృష్ణతోపాటు ఈరోజు జిల్లాలోని ఇతర డివిజన్లకు సంబంధించిన వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ కావించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ జరిగింది. పులిచర్ల నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ.. ఇలాంటి మహనీయుని విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావడం మహా పుణ్యమని తెలిపారు. దేశం కోసం దేశ ప్రజల కోసం ఆయన మన దేశం నుండే కాకుండా జపాన్ నుండి ఆజాద్ హిందూ ఫౌజ్ అనే సంస్థను ఏర్పాటు చేసి బ్రిటిష్ వారిని గడగడలాడించారన్నారు అలాంటి ధైర్యశాలి అయినా నేతాజీ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణం అన్నారు. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పులిచర్ల వెంకటనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. భరతమాత ముద్దుబిడ్డగా ఈ దేశానికి ఎంతో సేవ చేసిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు భరతమాత బిడ్డలుగా మనపై ఎంతో బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు విద్యాభ్యాసం చేసిన సహచరులు హాజరై ఆయనను అనంతరం ఎంపీపీని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్పర్సన్ పులిచెర్ల అరుణమ్మ ఎంపీపీ వనిపెంట హైమావతి సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ మద్దూరు గోపాల్ రెడ్డి కోడూరు నాగిరెడ్డి మండల బిజెపి మాజీ అధ్యక్షులు దేగ మధు యాదవ్ ప్రస్తుత అధ్యక్షులు అంబటి ఈశ్వర్ రెడ్డి మద్దూరు రాజగోపాల్ రెడ్డి మద్దూరు చంద్రారెడ్డి మోహన్ రావు ఆయన సహచర బృందం వై.శ్రీనివాసులు నాయుడు అంచూరి శ్రీనివాసులు రామ బ్రహ్మం విశ్రాంత ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

# ఆపస్ టాలెంట్ టెస్ట్ విజేతలు వీరే

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** గత 26సంవత్స రాలుగా ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే పదవ తరగతి చదువుచున్న విద్యార్థులకు ఆపస్ ప్రతిభాపాటవ పరీక్షను నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఈ విద్యా సంవత్సరం కూడా జనవరి 25వ తేదీన స్థానిక వైఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో టాలెంట్ టెస్టను వింజమూరు మండల అపస్ శాఖ నిర్వహించింది. ఈ పరీక్షలో 50 పాఠశాలల నుండి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో 10 ఉన్నత బహుమతులు ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి ఎన్.గురు విగ్నేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వింజమూరూ ద్వితీయ బహుమతి మోక్ష సాయి శ్రీ తిమ్మారెడ్డిపల్లి పాఠశాల,తృతీయ బహుమతి వి మనోజ్ కుమార్ రెడ్డి గొట్టి గుండాల ఉన్నత పాఠశాల, చతుర్థ బహుమతి సిహెచ్ కరీనా ఏపీ మోడల్ స్కూల్, దుత్తలూరుపంచమ బహుమతి టీవీజీ వర్షిత్ జలదంకి ఉన్నత పాఠశాల, ఆరవ స్థానం బి.అఖిల్ జలదంకి ఉన్నత పాఠశాల, ఏడవ స్థానం ఎస్‌కెఎం రహీల వింజమూరు బాలికల ఉన్నత పాఠశాల, 8వ స్థానం డి నమ్రుతా బ్రాహ్మణ కాక, తొమ్మిదవ స్థానం డి.రుత్విక్ చరణ్ గుండె మడకల ,పదవ స్థానం ఈ అక్షయ వింజమూరు బాలికల ఉన్నత పాఠశాల పొందారు వీరికి బహుమతి దాతలుగా డాక్టర్ మా శిలామణి ఎల్లాల మాల్యాద్రి వనిపెంట వెంకట సుబ్బారెడ్డి డాక్టర్ సఫీ కర్నాటి ప్రసాద్ సమకూర్చారు. ప్రతి విద్యార్థికి పరీక్ష ప్యాడ్, పెన్ ఉచితంగా ఇవ్వబడింది డాక్టర్ మా శిలామణి మాట్లాడుతూ.. వింజమూరు మండల శాఖ గత 26 సంవత్సరాలుగా ఈ పరీక్ష నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చిన్నతనం నుండి చదువుతోపాటు నైతిక



విలువలు కూడా పెంపొందించుకోవాలన్నారు. విశ్రాంత ఉప విద్యాశాఖ అధికారి దశపతి మాట్లాడుతూ.. ఆపస్ కేవలం ఉపాధ్యాయ హక్కుల కోసమే కాకుండా బాధ్యతలు కూడా గుర్తేరిగిపని చేస్తున్నందుకు అభినందనీయమన్నారు. విద్యార్థులందరూ వికసిత భారత్ కోసం కృషి చేయాలన్నారు విద్యార్థులను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయం అన్నారు ఉదయగిరి నియోజకవర్గ బిజెపి నాయకులు ముడుమాల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. టాలెంట్ అంటే కేవలం విద్యా బోధనకాదు సేవ చేయగలగడం కూడా ప్రతిభ అన్నారు. విద్యార్థులకు బహుమతులు సమకూర్చడం సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పి.వెంగయ్య, పి.వెంగళరావు, జి.మాధవ, ఎం.శ్రీనివాసులు, వివి చలమయ్య, డివిజన్ కార్యదర్శి కందల మధు, కృష్ణారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వరప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవ తరగతి స్టడీ అవర్స్ తనిఖీ : ఎంఈఓ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి వందరోజుల ప్రణాళికలో భాగంగా అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు, చిలకలమర్రి వెంగంపల్లి, అనంతసాగరం గ్రామాలలోని ఉన్నత పాఠశాలలను ఆదివారం ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో స్టడీ అవర్స్ పై సమీక్ష నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వం తేదీలు ప్రకటించినట్లు అన్నారు. సమయం దగ్గర పడే పంది విద్యార్థులు ఒత్తిడి కాకుండా బాగా చదువుకోవాలని అన్నారు. విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తారని అన్నారు. స్టడీ అవర్స్‌కి రాణి పదో తరగతి విద్యార్థిని తల్లిదండ్రులు వద్దకు వెళ్లి వివరాలు సేకరించి విద్యార్థులని పంపించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా ఉత్తమ ఎంఈఓకు సత్కారం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ఉత్తమ ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎంపిక చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎంపికైనందుకు అనంతసాగరం మండలం అంతిమతీర్పు రిపోర్టర్ ఎం.కృష్ణ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## అంతర్జాలంలో దరఖాస్తులు స్వీకరణ

● గురుకులం ప్రిన్సిపాల్ సుజాత

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండల కేంద్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థిని లు అంతర్జాలంలో దరఖాస్తులు పంపాలని కళాశాల ప్రిన్సిపల్ సుజాత ఆదివారం తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ వెబ్సైట్ https:apgpcet.apcfss.inలో వివరాలు నమోదు చేయాలన్నారు. ఐదవ తరగతిలో 80 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్మీడియట్ నందు ఎంపీసీ, బైపిసి భాగాల్లో 80 సీట్లును సమాన ప్రాతిపదికన భర్తీ చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ వెల్లడించారు. రిజర్వేషన్ ఆధారంగా ఎస్సీ 75శాతం, ఎస్టీ 6 శాతం, బీసీ-సీ 11శాతం, బిసి-5 శాతం, ఓసి మూడు శాతం ప్రాతిపదికన సీట్లు కేటాయింపు జరుగుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. దరఖాస్తులు చేసే సందర్భంలో తప్పనిసరిగా ఫోటో, ఆధార్, మొబైల్ నెంబర్, కుల ధ్రువీకరణ పత్రాలు నింపాలని ప్రిన్సిపల్ తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి

## ఓటు హక్కు కల్పించాలి : కమిషనర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 117 నెల్లూరు నగర నియోజకవర్గ అసెంబ్లీ పరిధిలోని వివిధ పోలింగ్ బూతుల వద్ద అధికారులు, సిబ్బంది ఆదివారం ప్రతిజ్ఞలను నిర్వహించారు. నియోజకవర్గ ఈఆర్ఓ వైఓ నందన్ స్థానిక స్టోన్ హౌస్ పేట ప్రాంతంలోని బివిఎస్ గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలోని పోలింగ్ బూతులను అధికారులతో కలిసి సందర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఆత్మకూరులో ఘనంగా ఓటరు దినోత్సవం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఆర్డీవో భూమిరెడ్డి పావని ఆధ్వర్యంలో ఆదివారం జాతీయోటరుదినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సినియర్ సిటిజన్‌లను ఆర్డీవో ఘనంగా సన్మానించారు. ఇటీవల నిర్వహించిన వివిద పోటీల్లో విజేతలకు ఆర్డీవో పావని బహుమతీప్రధానం గావించారు. ఈసందర్భంగా ఆమె ప్రసంగిస్తూ ఓటు విలువను అందరూ తెలుసుకోవాలని, ఓటుహక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయ ఓటర్ల దినోత్పవం సందర్భంగా ఓటు విలువ గురించి ఆమె వివరించారు. ఈ సందర్భంగా అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో పావని ప్రసంగిస్తూ ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటుద్వారానే పాలకులను ఎన్నుకోవాల్సిన విషయం సర్వం విధితమేనన్నారు. ఓటు అత్యంత పవిత్రమైనదన్నారు. 18సంవత్సరాలు నిండినవారంతా ఓటుకు అర్హులేనని, ఓటు పొందడం తమ హక్కుఅని, అందరూ ఓటరుగా నమోదుచేసుకోవాలని ఆమె కోరారు. పొందిన ఓటును ఎన్నికల సమయంలో సద్వినియోగం చేసుకోవాలని, మంచి అభ్యర్థులను తమ ఓటుద్వారా ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని ఆమె సూచించారు. ఓటు ఆవశ్యకతను ఆమె వివరించారు. ఎన్నికల సంఘం అర్హులైన వారందరూ ఓటరుగా ఉండాలన్నదే లక్ష్యంగా అవకాశం కల్పిస్తుందన్నారు. ఓటును ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్వినియోగం చేయరాదని పావని కోరారు. ఈసదస్సులో తహశిల్దారు పి.పద్మజాకుమారి, కార్యాలయ సిబ్బంది, బిఎల్‌వోలు, రెవిన్యూసిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, పలువురు సీనియర్ సిటిజన్లు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈ జీవితం ఎందుకో తెలుసుకొని పయనించడమే గమ్యం

## కడప మాస్టర్ వెంకటసుబ్బయ్య



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఈ జీవితం ఎందుకో తెలుసుకొని ఆ మార్గంలో ప్రయాణించి గమ్యాన్ని చేరుకోవడమే జీవిత పరమార్ధమని కడప సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఆర్. వెంకటసుబ్బయ్య అన్నారు. వింజమూరులోని శ్రీ వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం నందు ఆదివారంబి ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని ధ్యాన సాధన అనంతరం అద్భుతమైన ఆత్మజ్ఞానాన్ని అందించారు. మనం అనుభవాల ద్వారా అనేక పాఠాలు నేర్చుకొని, జీవిత అంతిమ గమ్యమైన సత్యలోకాన్ని చేరుకోవడమే అసలు సిసలైన లక్ష్యమని దీనికోసం ధ్యానం, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, సేవ ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు. అనేక భగవద్గీత శ్లోకాలను, భజగోవిందం గీతాలను గీతాలను పాడి, వాటి యొక్క అంతరార్థాలను ఉదాహరణలతో చక్కగా విశ్లేషించారు. మాస్టర్ యొక్క జ్ఞానము ఎంతగానో ఆకట్టుకునింది. భగవంతునికి అత్యంత ఇష్టమైన పుష్పాలను మాత్రమే మనము సమర్పించాలని, వాటిలో ముఖ్యమైనవి ఇంద్రియ నిగ్రహ పుష్పం, క్షమా పుష్పం, జ్ఞాన పుష్పం, అహింసా పుష్పం, ధ్యాన పుష్పం, మోక్ష పుష్పం, తపస్సు పుష్పం ఇచ్చినప్పుడు మాత్రమే భగవంతుడు పరవశించిపోతాడన్నారు. కానీ మనం అనుకునే చెట్లకు కాసే పుష్పాలను సమర్పించినప్పుడు భగవంతుడు పట్టించుకోడని, ప్రతి ఒక్కరూ ఈ సత్యం తెలుసుకొని అందరూ అహింసా మార్గంలో, ధ్యాన మార్గంలో పయనించాలని వారు తెలియజేశారు. ధ్యానం యొక్క గొప్పతనమును గూర్చి చక్కగా వివరించారు. జ్ఞానాన్ని అందించిన మాస్టర్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ధ్యానులందరికీ సీనియర్ పిరమిడ్ మాస్టర్ చక్కటి ధ్యాన ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో హేమలత, ఉమా, రాజేశ్వరి, స్వరాజ్యం, ఆదిలక్ష్మి, స్వప్న, పద్మ, లక్ష్మి, రమణారెడ్డి, ఆచారి, రమణయ్య ఇంకా పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

# సృష్టిలో అతి మధురమైనది స్నేహం ఒక్కటే

## ● పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు బాలుర ఉన్నత పాఠశాలలో 1977-78 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆనాటి జ్ఞాపకాల నెమరువేత మధ్య ఆదివారం స్థానిక విఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఆత్మీయ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మద్దూరు గోపాల్ రెడ్డి డాక్టర్ రాజేశ్వరరావు కొండా ప్రసాద్ పులిచెర్ల నారాయణరెడ్డి గంగిశెట్టి కామేశ్వరరావు మాట్లాడుతూ దాదాపుగా నాలుగు దశాబ్దాల అనంతరం ఒకరికొకరు కలుసుకోవడం ఎంతో శుభ పరిణామం అని తెలిపారు. సృష్టిలో అతి మధురమైనది మనిషి జీవితంలో ఎన్నటికీ మరువలేనిది ఒక్క స్నేహం మాత్రమే ఉన్నారు. చదువుకునే రోజుల్లోనే అల్లరి గురువుల శిక్షణ పాఠశాల అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ అలనాటి విద్యార్థి జీవితాన్ని గుర్తు చేసుకోవడంతో ఎంతో ఆనందాన్ని పొందారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు తమ స్నేహాన్ని ఇలాగే కొనసాగించాలని కష్టసుఖాలలో తోడుండాలని అందరూ నిర్ణయించుకున్నారు ఈ ఆత్మీయ సమ్మేళనం పాత మిత్రులందరికీ అనంతరం వారు చదివిన పాఠశాలకు విచ్చేసి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులున్నారు.

# ప్రమాదకరంగా మారిన రహదారులు

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గాల్లో రోడ్లు దారుణంగా ఉన్నా నాటి ప్రభుత్వంలో రోడ్లు పై ఉద్యమాలు చేసిన పవన్ కళ్యాణ్ ఎటు పోయారో డిప్యూటి సిఎం అయ్యాక అంధకారంలోకి పోయావా అంటూ సిపిఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి ఆరోపించారు. సైదాపురం వయా కలిచేడు నుండి డేగపూడికి వెళ్ళే రోడ్డు దుస్థితి పై సిపిఐ నాయకులు శ్రేణులతో జిల్లా పార్టీ కార్యదర్శి నాగేంద్ర సాయి ఆద్వర్యంలో సైదాపురం మండలం సిపిఐ నెల్లూరు జిల్లా సమితి సభ్యులు చంద్రగిరి వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో ఆదివారం ఉదయం కలిచేడు నుండి డేగపూడి వైపు ర్యాలీ గా వెళ్ళి రోడ్డు పై పెద్ద గుంటల్లో మట్టి పోసి నిరసన కార్యక్రమం చేసి ధర్నా చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి బస్సు లోకి ఎక్కి ప్రయాణికులతో రోడ్ల ను గురించి అడిగి తెలుసుకుని నెల్లూరు పొదలకూరు ఎంత సమయం పడుతుందొ అంత కు రెట్టింపు డేగపూడి రోడ్డు పై ప్రయాణం పడుతుందని ప్రయాణికులకు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తన వెన్ను పోటు పొడిచిన మేనమామ పేదల మంచి దివంగత సీఎం ఎన్‌టిఆర్ విగ్రహం అమరావతి లో ప్రజల డబ్బుతో ఖర్చు పెట్టడానికి సిద్ధం అయ్యారు కానీ సైదాపురం డేగపూడి రోడ్లు వేయటానికి మాత్రం డబ్బులు లేవా అని అరిగెల నాగేంద్ర సాయి ప్రయాణికులకు అవగాహన కలిగించారు. పేద బడుగు బలహీనవర్గాలు ప్రజలు ఎదుర్కొనే సమస్యలు పై, విద్యార్దులు, రైతులు, కార్మికుల పక్షాన పోరాడి సమస్యలు పరిష్కారం చేయటానికి కమ్యూనిస్టు పార్టీలు పని చేస్తున్నామన్నారు. తమ పార్టీ ఓటుకు నోటు ఇవ్వదని ఎంఎల్‌ఏలు, ఎంపిలుగా గెలిచిన అధికార దర్భం ఆర్భాటాలు లేకుండా అభివృద్ధి వైపు ప్రజల పక్షాన పని చేస్తామని,అధికారం కోసం ఏనాడు కమ్యూనిస్టులుగా పాకులాడమని ఆయన చెప్పారు.

# 28 మందికి రిపబ్లిక్‌డే జిల్లా అవార్డులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో రిపబ్లిక్‌డే సైందర్భంగా జిల్లా స్థాయి అవార్డులకు 28మంది అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. వారు సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్లా చేతులమీదుగా అవార్డులు స్వీకరించనున్నారు. ఉత్తమసేవలందించిన ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని, ఆర్డీవో కార్యాలయ డిటి సాయిచంద్, ఆత్మకూరు డిఎస్‌పి కె.వేణుగోపాల్, ఆత్మకూరు ఎస్‌ఐ షేక్ జలానీ, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఎస్.కొండయ్య, ఆర్డీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సూర్యహర్ష, రైతుసాధికారసంస్థ ఎన్‌ఎఫ్‌ఏ పి.చంద్ర, ఆర్డీవో కార్యాలయ ఆర్‌జిఎస్‌ఏ జి.హెచ్.సుధాప్రియ, మున్సిపల్ ఏయి డి.మాధవి, వార్డు ప్లానింగ్‌కు చెందిన ఖాజాసాహెబ్, వెటర్నరి వైద్యులు డాక్టర్ బాలకోటేశ్వరరావు, డ్వామా ఏపిడి ప్రతాప్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ వినయ్‌కుమార్, ఆర్టీసీ డిపోమేనేజర్ శివకేష్‌యాదవ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, నెల్లూరుపాళెం అంగన్‌వాడీ కార్యకర్త ఏ.మస్తానమ్మ, ఏఎస్‌డబ్ల్యుఓ కార్యాల జూనియర్ సహాయకుడు దయాకర్, సబార్డినేట్ ఖాజారసూల్, హాస్టల్‌వెల్ఫేర్‌ఆఫీసర్ మమత, పిఆర్ పిఐయు డీఈ సుధాకరయ్య, ఫైర్ ఆఫీసర్ బాలాజీ గురుప్రసాద్, ఫైర్‌మ్యాన్ రబ్బానిబాషా, అటవీ బీట్‌ఆఫీసర్ చెంచురాములు అవార్డులకు ఎంపికయ్యారు. పలువురు వారిని అబినందించారు.

# ఓటు హక్కు విశిష్టతపై అవగాహన పెంచుకోవాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విశిష్టతపై అవగాహన పెంచుకొని మంచివారిని ఎన్నుకోవాలని లోక్సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండరెడ్డి పేర్కొన్నారు. జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వచ్చిన యువతి యువకులు ఓటు హక్కును వినియోగించుకొని మంచి అభ్యర్థులకు ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని సుసంపన్నం చేయాలని తెలిపారు. ఓటరు ఆలోచించి అవగాహనతో సమర్ధులు దేశభక్తులను చట్టసభలకు పంపాలని కోరారు. అప్పుడే అవినీతి రహిత సమాజ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం నిర్మాతలు స్వాతంత్ర సమరయోధులు కలలు కన్నా సమాజ నిర్మాణం జరగాలంటే ఓటర్లు ఎలాంటి ప్రలోభాలు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. జాతీయ ఎన్నికల కమిషన్, ప్రజాస్వామిక వాదులు పౌర సంస్థలు నిరంతరం ఎన్నికల ప్రక్రియపై ప్రజలను చైతన్యపరిచి ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని భావించి ప్రజలను జాగృతి చేయాలని కోరినారు రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా ఎన్నికలలో సామాజిక స్పృహ కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసినచో నిజాయితీపరులు సమర్ధులు సజీవులు ఎన్నిక కావడం ద్వారా భారత ప్రజా స్వామికి వ్యవస్థ సుసంపన్నం అవుతుందని చట్టసభలకు గౌరవం పెరుగుతుందని దీని కొరకు ప్రజాస్వామిక వాదులు నిరంతరం ఓటర్లను చైతన్య పరుస్తూనే ఉండాలని కోరుతున్నారు.

# ఏపీ జెన్కో కార్మికులు సమ్మె నోటీసు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కార్మికుల సమస్యలపై దేశవ్యాప్తంగా వచ్చే నెల 12వ తేదీన జరగనున్న సమ్మె గురించి తెలియజేస్తూ ఏపీ జెన్కో ప్రాజెక్ట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదివారం ప్రాజెక్టు ఉన్నతాధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. నోటీసులో 13 డిమాండ్ల పైన సమ్మె చేస్తున్నట్లు తెలియజేయాలి వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# రంగనాథుడి సన్నిధిలో మంత్రి నారాయణ దంపతులు

- రథసప్తమి వేళ భక్తుల కోలాహలం
- మంత్రి నారాయణ, రమాదేవి దంపతులకు ఆలయ అధికారుల పూర్ణకుంభ స్వాగతం
- రంగడి చెంత మంత్రి నారాయణ దంపతులు
- ఘాట్ ఆధునీకరణపై హామీ
- 2018లోనే ఆలయ అభివృద్ధి మొదలుపెట్టాం
- స్వామికి 7 వాహనాలు చేయించాం
- చంద్రబాబు పాలనలో రాష్ట్రం బాగుండాలి
- ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర ఆరాధ్య దైవం శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తన సతీమణి రమాదేవితో కలిసి ఆదివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి నారాయణ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు. రథసప్తమి సందర్భంగా సతీమణి రమాదేవితో కలిసి మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై కొలువైన స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేద పండితులు మంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. దర్శనం అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, ఏర్పాట్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది రథసప్తమికి సుమారు 50వేల మంది భక్తులు వస్తారని అంచనా వేసి, అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. అదేవిధంగా 2018లోనే ఆలయ అభివృద్ధికి తాము ప్రత్యేక కృషి చేశామని మంత్రి గుర్తు చేశారు. స్వామివారి ఉత్సవాల కోసం ఏడు వాహనాలను ఏర్పాటు చేశామని, భక్తుల పుణ్యస్నానాల కోసం పెన్నా ఘాట్‌ను త్వరలోనే ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిరా శ్రీనివాసులు, ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతారెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కపిరా రేవతి, ప్రెసిడెంట్ సిద్దయ్య, లెక్కల వెంకరెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులు రెడ్డి స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నవాబుపేట స్టేషన్ పరిధిలో తనిఖీలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష ఐపిఎస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు గణతంత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలని ఉద్దేశంతో ఆకస్మికతనికి నిర్వహించినట్లు దీక్ష వెల్లడించారు. నెల్లూరు టౌన్ ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణే లక్ష్యంగా ప్రత్యేక బలగాలు స్థానిక పోలీసు బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ వార్డ్‌ల సహకారంతో ఆత్మకూరు బస్టాండ్, రైల్వేస్టేషన్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు లేదా అనుమానస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే డైల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఏఎస్పీ దీక్ష ప్రజలను కోరారు. ఈ తనిఖీలలో నవాబుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, సంతపేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### శాశ్వత ఉద్యోగాలు ఎక్కడ?

# గ్రామం తరలింపు ఏది!



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఏపీ జెన్కో ప్రాజెక్టులో కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత ఉద్యోగాలు ఎక్కడున్నాయని నేలటూరు గ్రామ నిర్వాసితులు ప్రశ్నించారు. ఆదివారం ప్రాజెక్టు మెయిన్ గేటు వద్ద ఈ అంశంతోపాటు కాలుష్యం, గ్రామం తరలింపు, మౌలిక సదుపాయాలు తదితర డిమాండ్ల పైన స్థానికులతోపాటు కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తదుపరి ప్రాజెక్టు అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# పేద కుటుంబాలకు భరోసాగా సీఎంఆర్ఎఫ్

- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పేద కుటుంబాలకు భరోసా అని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి రామ నారాయణ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 640మందికి రూ.6.18కోట్లు మంజూరు చేశామని మంత్రి ఆనం పేర్కొన్నారు. పేదల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిఅన్నారు. ఆదివారం ఆత్మకూరు ఆర్‌అండ్ బి అతిథిగృహంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 67 కుటుంబాలకు రూ.39లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి ఆనం పంపిణీ చేశారు. అత్యవసర సమయాల్లో మన రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లోని కార్పొరేటు ఆసుపత్రుల్లో వైద్యచికిత్సలు పొందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి లక్షలాదిరూపాయలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 640మందికి రూ.6.18కోట్లు మంజూరు చేసి ఆ కుటుంబాలకు అండగా నిలిచినట్లు చెప్పారు. పేదల సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రా రెడ్డి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, తెలుగుదేశం నాయకులు తాళ్లూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రా రెడ్డి, కేతా విజయ భాస్కర్ రెడ్డి, దావా పెంచలరావు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తలచిరు బాబునాయుడు, కమిషనర్ గంగా ప్రసాద్, తహసీల్దార్ పద్మజా కుమారి, ఎంపిడివో రఫీఖాన్,స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# విశిష్ట సేవా అవార్డుకు ఎంపికైన జిలాని

- 30 ఏళ్లుగా అంకితభావంతో ఎక్సైజ్ శాఖలో విధులు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు పొదలకూరు ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న షేక్ జిలానిని ఉత్తమ సేవా అవార్డుకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు సందర్భంగా నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల నుంచి ఈ అవార్డును అందుకోనున్నారు. 1995లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులలో చేరిన జిలాని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో విధులు నిర్వహించాడు. అనంతరం 16 జీవోలో భాగంగా ఆంధ్ర ప్రాంతానికి బదిలీపై వచ్చిన జిలాని కోవూరు, పొదలకూరు ఎక్సైజ్ స్టేషన్‌లతోపాటు ఎన్ఫోర్స్మెంట్ విభాగంలో విధులు నిర్వహించాడు. ఏ విభాగంలో పనిచేసిన అంకితభావంతో తన విధులను నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. ఎక్సైజ్ శాఖలో సుదీర్ఘకాలం పాటు తన సేవలను గుర్తించిన జిల్లా ఉన్నతాధికారులు విశిష్ట సేవా అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో పొదలకూరు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు, ఎస్ఐలు అయ్యప్ప, అంజయ్యలు, సహచర సిబ్బంది జిలానికి అభినందనలు తెలిపారు.

## శ్రీ వేంకటేశ్వరుని పల్లకి సేవ



**నెల్లూరు కల్చరల్, మేజర్ న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్ నందు వేంచేసియున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఆదివారం రథసప్తమి పర్వదినం సందర్భంగా దేవస్థానంలో శ్రీవారు అశ్వవాహనల పై విహరించారు.ఈ ఊరేగింపు ను ఆలయం వారు వైభవంగా నిర్వహించారు.స్వామి వారి ఊరేగింపుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఊరేగింపు అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా రథసప్తమి వేడుకలు శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి భక్తులు విశేషంగా తరలి వచ్చి సూర్య భగవానుడుని దర్శించుకున్నారు. సూర్య జయంతిగా పిలువబడే ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్య దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు తెల్లవారుజామునే పవిత్ర స్నానాలు ఆచరించి, జిల్లేడు ఆకులను తలపై పెట్టుకుని స్నానం చేయడం ద్వారా సూర్యుని అనుగ్రహం పొందుతారని నమ్ముతారు. ఇళ్ల ముందు రథం ముగ్గులు వేసి, చిక్కుడు కాయలతో రథం చేసి సూర్యుడికి పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు. ఈ పవిత్రమైన రోజున సూర్య భగవానుడిని ఆరాధించడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం సిద్ధస్తాయని భక్తుల విశ్వాసం. భక్తులకు ఆలయ అధికారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## కల్వర్టుకు మరమ్మత్తులు చేయండి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చౌట భీమవరం గ్రామ సమీపంలో కల్వర్టు పూర్తిగా దెబ్బతిని కుంగిపోవడంతో గ్రామస్తులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు వింజమూరు నుంచి ఏఎస్పేట దర్గాకు వచ్చే యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు వాహనదారులు ఆటోలు సైతం వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాయని రాకపోకులకు తీవ్ర అసౌకర్యంగా ఉందని వాపోయారు సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.